హైదరాబాద్
15-8-2023
సంపుటి:08
సంచిక: 344
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor: G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
తెలుగు దిన పత్రిక
SAMA SAMAJAM TELUGU DAILY
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

పాఠకులకు, ప్రజా ప్రతినిధులకు, శ్రేయోభిలాషులకు, మిత్రులకు



స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు...
ఎడిటర్...

# కాంగ్రెస్ వస్తే కుంభకోణాల కుంభమేళానే



## ఎల్లారెడ్డి సభలో మంత్రి కేటీఆర్ ఫైర్
## ధరల పెరుగుదల పాపం కేంద్రంలోని బీజేపీదే
## కేసీఆర్ నాయకత్వంలో అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధి

కామారెడ్డి: 'యాభై ఏండ్లు అధికారం వెలగబెట్టిన కాంగ్రెసోళ్లు ఎన్ని ఘనకార్యాలు జేసింగ్రో జూసినం. ఇప్పుడు అధికారం కోసం అలవికాని హామీలు ఇస్తున్నరు. వాళ్ల మాటలు నమ్మితే మోసపోవుడే. అంతేగాదు వాళ్లు అధికారంలో ఉంటే కుంభకోణాల కుంభమేళా తీసుకువస్తరు..'అని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ ఆరోపించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు ఎల్లారెడ్డి పట్టణంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశా రు. ఎల్లారెడ్డి పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

**ఎవరు కావాలో ఆలోచించుకోండి..**

కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు దొంగరాత్రి కరెంటుతో ఎంతోమంది రైతులు కరెంటు షాకులు, పాముకాట్లకు బలయ్యారని, అప్పుడు అరిగోస పెట్టి, ఇప్పుడేమో చిలకపలుకులు

2లో



2లో

# హిమాలయ రాష్ట్రాల్లో.. వర్ష బీభత్సం

- హిమాచల్‌లో 51 మంది మృతి
- ఆలయంపై పడ్డ కొండచరియలు
- తొమ్మిది మంది సజీవ సమాధి
- శిథిలాల కింద మరో 20 మంది
- చార్‌ధామ్ యాత్రకు రెండ్రోజుల బ్రేక్

న్యూఢిల్లీ/సిమ్లా/డెహ్రాడూన్, ఆగస్టు 14: హిమాలయ రాష్ట్రాల్లో ఆకాశానికి చిల్లులు పడ్డాయి. శివాలిక్ రాష్ట్రాలైన హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో భారీగా ఆస్తి, వనరులు, ప్రాణ నష్టం సంభవించింది. ఒక్క హిమాచల్‌లో వేర్వేరు చోట్ల కొండచరియలు విరిగిపడడం, వరద కారణంగా 51 మంది మృతిచెందారు. పౌరులంతా ఇళ్లలోనే ఉండాలని, కాలువలు, నదుల వద్దకు వెళ్లకూడదని హిమాచల్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు హెచ్చరించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలుపుతూ ట్వీట్ చేశారు. సోలన్ జిల్లా జాదోన్ గ్రామంలో క్లౌడ్ బరస్ట్

# ఇక భానుడిపై గురి


- ఆదిత్య-ఎల్1 లాంచింగ్‌కు సిద్ధమవుతున్న ఇస్రో
- సెప్టెంబరు మొదటివారంలో ప్రయోగం



సూళ్లూరుపేట, ఆగస్టు 14: ఒకవైపు చంద్రయాన్-3 పనుల్లో బిజీబిజీగా ఉన్న ఇస్రో మరోవైపు.. తొలిసారిగా సూర్యుడిపై అధ్యయనానికి రెడీ అవుతోంది. దీనికోసం ఆదిత్య-ఎల్1 ఉపగ్రహాన్ని బెంగళూరులోని

2లో

# విజన్ 2047 విడుదల నేడే



## నేడు విశాఖకు చంద్రబాబు
## బీచ్‌రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం నుంచి అల్లూరి విగ్రహం వరకు పాదయాత్ర

విశాఖపట్నం, అమరావతి, న్యూఢిల్లీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విజన్ 2020 తరహాలో విజన్ 2047 డాక్యుమెంట్‌ను తెలుగుదేశం అధినేత చంద్రబాబు మంగళవారం సాయంత్రం విశాఖపట్నంలో విడుదల చేయనున్నారు. ఉడా పార్కులోని ఎంజీఎం మైదానంలో మేధావులు, విద్యావంతులతో

2లో

# రూ.99,999 వరకు రుణమాఫీ క్లియర్

## స్వాతంత్ర్య దినోత్సవ వేళ రైతులకు సర్కారు శుభవార్త

- తక్షణమే బ్యాంకుల్లో సొమ్ము జమ చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశం
- 9,02,843 మంది రైతులకు ఒక్కరోజే రూ.5,809.78 కోట్లు విడుదల
- ఇప్పటివరకు 16,22,330 మంది రైతులకు రూ.7,753.43 కోట్లు మాఫీ
- రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మరోసారి రుజువైంది: సీఎం కేసీఆర్
- రైతుబంధు, బీమా, ఉచిత విద్యుత్‌లతో అండగా నిలిచామని వెల్లడి



హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇచ్చిన హామీ మేరకు రూ.99,999 లోపు ఉన్న పంట రుణాలన్నింటినీ మాఫీ చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు సదరు రైతుల రుణాలున్న బ్యాంకుల్లో తక్షణమే సొమ్ము జమ చేయాలని సీఎం కేసీఆర్ సోమవారం ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఈ మేరకు ఆర్థిక శాఖ సోమవారం రూ.5,809.78 కోట్ల

మిగతా 2లో



# అందరూ సమానమే

## అన్ని రంగాల్లో మహిళల ముందడుగు.. స్వాతంత్ర్యదిన సందేశంలో ముర్ము

న్యూఢిల్లీ, ఆగస్టు 14: దేశంలోని పౌరులందరూ సమానమేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సోమవారం జాతినుద్దేశించి ప్రసంగించిన ఆమె రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ

మిగతా 2లో

# అదే వైసీపీ నేతల లక్ష్యం

- ఈ ప్రాంతంపై వారికి ప్రేమే లేదు.. పచ్చని కొండలను పిండి చేస్తున్నారు
- రియల్ వెంచర్లు వేస్తున్నారు.. వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారు
- దోపిడీపై సీఎం జవాబు చెప్పాలి.. విస్సన్నపేటకు సరైన రోడ్డే లేదు
- కానీ దళితుల భూములు ఆక్రమించి వెంచర్ కోసం పెద్ద రోడ్డు వేశారు
- కొండల ధ్వంసంపై పర్యావరణ బోర్డుకు, ఎన్‌జీటీకి ఫిర్యాదు: జనసేనాని



అనకాపల్లి/కశింకోట: ఉత్తరాంధ్రపై వైసీపీకి ఎటువంటి ప్రేమా లేదని, ఈ ప్రాంతంలో భూముల దోపిడీయే ఆ పార్టీ నేతల లక్ష్యమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించారు. పర్యావరణాన్ని దెబ్బతీసేలా పచ్చని కొండలను సైతం పిండి చేసి అడ్డగోలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం ఆయన అనకాపల్లి జిల్లా కశింకోట మండలం విస్సన్నపేట ప్రాంతంలో.. కొండలను కొట్టి, గెడ్డలను, వాగులను కప్పేసి చదును చేసిన వందలాది ఎకరాల

మిగతా 2లో

# సంపాదకీయం

## అనంత గొంతుకల అద్భుత భారత్!

'మాటలు హృదయం నుంచి వస్తే అవి ఆత్మలోకి ప్రవేశిస్తాయి' అని పర్షియన్ మహాకవి జలాలుద్దీన్ రూమి అన్నాడు. గత ఏడాది నేను 145 రోజులు పాదయాత్ర చేస్తూ గడిపాను. ఈ గడ్డపై కడలి నుంచి కొండదాకా నడిచాను. కన్యాకుమారిలో సముద్రం అంచున ప్రారంభించి ఎండ, ధూళి, వానలో నడిచాను. అడవులు, పట్టణాలు, పర్వతసీమలను దాటుతూ నా ప్రియమైన కశ్మీర్ కోమల మంచు కొండలు చేరేవరకు నడిచాను. ఈ యాత్ర సాగిన అన్నిచోట్లా చాలా మంది నన్ను అడిగారు: ఈ పాదయాత్ర ఎందుకు చేస్తున్నారు? ఎందుకు ఇలా ఆసేతు హిమాచలం నడుస్తున్నారు? దేనికోసం మీరు చూస్తున్నారు? మీ లక్ష్యమేమిటి? ఏమి కనుగొన్నారు? నా జీవితంతో సహా దేనినైనా వదులుకునేందుకు నేను సిద్ధంగా ఉన్నది దేనికోసం? అనేక సంవత్సరాలుగా ఎంతో బాధను, తీవ్రమైన నిందలను భరించగలిగేలా నన్ను చే?స్తున్నది ఏమిటి? ఈ భూమా? పర్వతాలా? సాగరమా? అది ఒక వ్యక్తా? ప్రజా సమూహమా? భావ సముదాయమా? నేను అభిమానిస్తున్నదేమిటో నికరంగా తెలుసుకోదలిచాను. నేను అవగాహన చేసుకోదలిచింది ఇంకేదో ఉంది. అనేక సంవత్సరాలుగా నేను ప్రతీ సాయంత్రమూ ఎనిమిది నుంచి పది కిలోమీటర్ల దూరం పరుగెత్తుతుండేవాణ్ణి. ఈ కారణంగా రోజుకు 25 కిలోమీటర్లు నడవగలనని అనుకున్నాను. ఓ పాతిక కిలోమీటర్లు నడవడం ఎంతో తేలిక అని నేను నిశ్చితంగా భావించాను. పాదయాత్ర ప్రారంభమయింది. కొద్ది రోజులలోనే నొప్పి నన్ను చేరింది. బాధ తీవ్రమయింది. గతంలో నా మోకాటి చిప్పకు గాయమయింది. దానితో కలిగిన నొప్పి కొద్ది గంటల ఫిజియోథెరపీతో పూర్తిగా తగ్గిపోయింది. అయితే ఇప్పుడు ఆ నొప్పి మళ్లీ తిరగబెట్టి ఎంతో బాధించసాగింది. మరుసటి రోజు ఉదయం కంటైనర్‌లో ఒంటరిగా కూర్చున్నప్పుడు దుఃఖం ఆగలేదు. ఇంకా 3800 కిలోమీటర్ల దూరాన ఉన్న గమ్యాన్ని ఎలా చేరుకోగలను? కుమిలిపోయాను. గర్వం దిగిపోయింది. అహంకృత ఆసరా కూలిపోయింది. పొద్దు పొడుపుకు ముందు విడీవీడని చీకటిలో నడవడం ప్రారంభించేవాళ్లం. వెన్వెంటనే మోకాటి చిప్పలో నొప్పి ప్రారంభమయ్యేది. ఆకలిగొన్న తోడేలు వలే అది నన్ను వెన్నంటి ఉండేది. నేను ఎప్పుడు నడక ఆపుతానా అని వేచి వుండేది. పాదయాత్ర ప్రారంభమైన కొద్ది రోజుల అనంతరం నా ఫిజియోథెరపిస్ట్ నాతో చేరాడు. నొప్పి నుంచి ఉపశమనం పొందేందుకు సలహాలు ఇచ్చాడు. అయినా బాధ మిగిలిపోయింది. ఇక అప్పుడు ఒక కొత్త విషయం నా గ్రహింపులోకి రావడం ప్రారంభమయింది. పాదయాత్ర విరమిద్దామని ఆలోచించిన ప్రతీ సారీ, నడకకు స్వస్తి చెప్పాలనే సూచనను పరిగణనలోకి తీసుకున్నప్పుడల్లా ఎవరో ఒకరు పాదయాత్రను కొనసాగించేందుకు అవసరమైన శక్తిని నాకు కానుకగా ఇచ్చేవారు. ఒకసారి ఒక చిన్న బాలిక, మరొకసారి ఒక వృద్ధురాలు. ముద్దు గొలిపే ఆ బాలిక ఒక అర్థవంతమైన లేఖను ఇచ్చింది. అనురాగమయి అయిన ఆ వృద్ధ మూర్తి బనానా చిప్స్ ఇచ్చింది. అంతలో ఒక మనిషి హఠాత్తుగా పరుగెత్తుకు వచ్చి నన్ను ఆలింగనం చేసుకున్నాడు. ఒక నిశ్శబ్ద శక్తి నన్ను ఆవహించినట్టనిపించేది. అది నా లక్ష్య పరిపూర్తిలో ముందుకు సాగేలా చేసేది. అవును, చీకటి గుయ్యారంలా ఉన్న అడవిలో మిణుగురుల్లా, ఆ శక్తి ఎల్లెడలా నన్ను ఆవహిస్తుండేది. కొత్త శక్తి నాకు నిజంగా అవసరమైనప్పుడల్లా అది నాకు తోడయ్యేది, నేను ముందుకు సాగిపోయేందుకు మార్గదర్శిగా ఉండేది.



## రూ.99,999 వరకు రుణమాఫీ క్లియర్

(మొదటి పేజీ తరువాయి)

విడుదలకు ఉత్తర్వులు జారీ చేసింది.

### ఆర్థిక ఇబ్బందులతో జాప్యమైనా..

2018 ఎన్నికల సమయంలో రైతులకు రూ.లక్ష వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాగానే విడతల వారీగా రుణమాఫీ చేయనున్నట్టు ప్రకటించారు. అయితే దీని అమల్లో జాప్యం జరిగింది. కరోనా మహమ్మారి విజృంభణ, లాక్‌డౌన్లతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడం, పెద్ద నోట్ల రద్దు ప్రభావంతో దేశవ్యాప్తంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి దిగజారి రుణమాఫీ ప్రక్రియ ఆలస్యమవుతోందని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. ఇటీవల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన నేపథ్యంలో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ ప్రక్రియ మొదలుపెడుతున్నట్టు చెప్పారు.

### 45 రోజుల కార్యాచరణతో

ఆగస్టు 2న సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించి రుణమాఫీ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. వెంటనే ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, ఆ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు చేసి.. 45 రోజుల కార్యాచరణ రూపొందించారు. సెప్టెంబర్ 15వ తేదీ నాటికి మొత్తం రుణాలను మాఫీ చేయాలని నిర్ణయించారు. అయితే ఇంతకు ముందే తొలి విడతగా 5,42,609 మంది రైతులకు సంబంధించి రూ.1,207.37 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో రెండో విడతగా.. ఆగస్టు 3, 4, 11 తేదీల్లో కలిపి 1,76,878 మంది రైతులకు సంబంధించి రూ. 736.27 కోట్లను బ్యాంకుల్లో జమ చేసింది. తాజాగా 9,02,843 మంది రైతులకు సంబంధించి రూ.99,999 వరకు ఉన్న రుణాలను మాఫీ చేశారు. మొత్తంగా ఇప్పటివరకు 16,66,899 మంది రైతుల రుణాలకు సంబంధించి రూ.7,753.43 కోట్లను విడుదల చేశారు.

### రాష్ట్రంలో రైతు రాజ్యం

తెలంగాణ రాష్ట్రం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని రుణమాఫీతో మరోసారి రుజువైందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. 2014లోనూ రైతుల రుణమాఫీ చేశామని, 35,32,000 మంది రైతులకు లబ్ధి చేకూరిందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సాగునీటి వసతుల కల్పనలో భాగంగా.. మిషన్ కాకతీయ కింద 35వేల చెరువుల పునరుద్ధరణ, కాళేశ్వరం వంటి బహుళార్థ సాధక ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టిందని వివరించారు. సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడం, నకిలీ విత్తనాల తయారీ, సరఫరాదారులపై పీడీ చట్టం ప్రయోగించి జైళ్లకు పంపడం, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం వంటివాటితో రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందని తెలిపారు. రుణమాఫీకి సంబంధించి సీఎం కేసీఆర్ నిర్ణయం, ఈ సందర్భంగా ఆయన పేర్కొన్న అంశాలతో సీఎం కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. దుఃఖంతో ఉన్న రైతు కుటుంబాలను ఆదుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు బీమాను అమలు చేస్తోందని, రైతు ఏ కారణంతో మరణించినా వారి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందుతోందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

# హిమాలయ రాష్ట్రాల్లో.. వర్ష బీభత్సం

(మొదటి పేజీ తరువాయి)

కారణంగా ఏడుగురు వరదలో కొట్టుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. "సిమ్లా నగరంలోని సమ్మర్‌హిల్ వద్ద శివాలయంపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతిచెందారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకుపోయారు. వారిని కాపాడేందుకు ఎస్డీఆర్ఎఫ్ దళాలు అహరహం శ్రమిస్తున్నాయి" అని ఆయన పేర్కొన్నారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో నివసించేవారు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. సిమ్లాలో ఆలయం వద్ద దుర్ఘటనతోపాటు.. మరోచోట కొండచరియలు విరిగిపడడంతో రెండు చోట్లా మరణాల సంఖ్య 14కి పెరిగిందని సిమ్లా డిప్యూటీ కమిషనర్ ఆదిత్య నేగి తెలిపారు. ఇక్కడ 19 మందిని కాపాడినట్లు ఎస్పీ సంజీవ్ కుమార్ వెల్లడించారు. కొండప్రాంతాల్లో కొండచరియల బీభత్సం, లోతట్టు ప్రాంతాల్లో బురద ప్రవాహం ఉధృతంగా ఉన్నట్లు తెలిపారు. సిమ్లాలో లోతట్టు ప్రాంతాల్లో చాలా ఇళ్లు బురద, మట్టి కింద కూరుకుపోయాయన్నారు. సోలన్ జిల్లా బలేరా పంచాయతీ పరిధిలో కొండచరియలు విరిగిపడటంతో ఇల్లు కూలి ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. రామ్‌షెహెర్ తహసీల్‌లోని బనాల్ గ్రామంలో కొండచరియలు విరిగిపడి ఓ మహిళ మరణించిందని సోలన్ డిప్యూటీ కమిషనర్ మన్మోహన్ శర్మ తెలిపారు. హమీర్‌పూర్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ముగ్గురు వ్యక్తులు చనిపోగా, ఇద్దరు గల్లంతయ్యారని వెల్లడించారు. మండీ జిల్లాలోని సెఘ్లీ పంచాయతీలో ఆదివారం అర్ధరాత్రి కొండచరియలు విరిగిపడి రెండేళ్ల చిన్నారి సహ ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి చెందారు. ఇక్కడ సోమవారం సాయంత్రానికి మరో నాలుగు మృతదేహాలు లభ్యమవ్వగా.. ముగ్గురిని రక్షించినట్లు డిప్యూటీ కమిషనర్ అరిందమ్ చౌదరి తెలిపారు. అయితే..



సోమవారం రాత్రికల్లా ఈ జిల్లాలో 19 మరణాలు నమోదయ్యాయని అధికారులు ప్రకటించారు.

భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలోని చాలా ప్రాంతాలకు రాకపోకలు స్తంభించిపోయాయని, రెండు జాతీయ రహదారులు సహా.. 752 రోడ్లను మూసివేశామని తెలిపారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా బడులకు సోమవారం సెలవు ప్రకటించారు. బీఎడ్ సహా.. పీజీ, ఇతర పరీక్షలను రద్దు చేశారు. చంబా, కాంగ్రా, హమీర్‌పూర్, మండీ, బిలాసపూర్, సోలన్, సిమ్లా జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఆదివారం ఒక్కరోజే వర్షాల కారణంగా రూ.7,020.28 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. జతోగ్-సమ్మర్ హిల్స్ రైల్వేస్టేషన్ మధ్య ట్రాక్ ధ్వంసమైంది. జూన్ 24న రుతుపవనాలు ప్రవేశించినప్పటి నుంచి రాష్ట్రంలో 257 మంది మృతిచెందారని, 32 మంది గల్లంతవ్వగా.. 290 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. హిమాచల్‌ప్రదేశ్‌కు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను తరలించామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు.

### ఉత్తరాఖండ్‌లో ముగ్గురి మృతి

ఉత్తరాఖండ్‌ను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడం.. కొండచరియలు విరిగిపడుతుండడంతో చార్‌ధామ్ యాత్రను మంగళవారం వరకు రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. పలు ప్రాంతాల్లో వర్షాల కారణంగా ముగ్గురు మరణించగా.. ఆరుగురు గల్లంతైనట్లు పేర్కొంది. రుద్రప్రయాగ్ జిల్లా కేదార్‌నాథ్ సమీపంలోని లించోలి వద్ద కొండచరియలు విరిగిపడి నేపాల్‌కు చెందిన కాలు బహదూర్(26), రిషికేశ్‌లోని శివ మందిర్, మీరానగర్ ప్రాంతాల్లో వరదలో ఇద్దరు మృతిచెందినట్లు వెల్లడించింది. పౌరీ జిల్లాలోని లక్షణ్‌జూలా ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి నలుగురైదుగురు గల్లంతయ్యారు. రుద్రప్రయాగ్, దేవ్‌ప్రయాగ్‌లలో గంగ, మందాకిని, అలకనంద నదులు ప్రమాదకరస్థాయిని దాటి ప్రవహిస్తున్నాయని అధికారులు వివరించారు.

## అందరూ సమానమే

(మొదటి పేజీ తరువాయి)

హక్కును ప్రముఖంగా ప్రస్తావించారు. "ప్రతి భారతీయుడూ సమాన పౌరుడే. ఈ నేలపై ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు, హక్కులు. బాధ్యతలు ఉన్నాయి" అని చెప్పారు. దేశంలో అందరికీ ఒకే గుర్తింపు ఉందని తెలిపారు. భారతీయ పౌరుడు అన్నదే ప్రధాన గుర్తింపు అనిబీ కులం, జాతి, భాష అన్న గుర్తింపులు దీని ముందు నిలవవని అన్నారు. ప్రజాస్వామ్యానికి భారత దేశం తల్లిలాంటిదని, కూకటివేళ్ల నుంచే ప్రజాస్వామ్య విలువలు ఉన్నాయని వివరించారు. స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన కస్తుర్బా గాంధీ, సరోజనీ నాయుడు, అరుణా అసఫాలీ వంటి మహిళామణుల పేర్లను ముర్ము ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచంలోనే ప్రముఖ ఆర్థిక శక్తిగా దేశం ఎదుగుతోందని రాష్ట్రపతి అన్నారు. ద్రవ్యోల్బణం ప్రపంచానికే ఇబ్బందికరంగా మారిందని, కానీ కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు కృషితో దేశం మాత్రం ఆ సమస్య నుంచి తప్పించుకొందని చెప్పారు. సవాళ్లను అవకాశాలుగా మార్చుకొని దేశం ముందుకు సాగుతోందని అన్నారు. పేరాశే సంస్కృతిగా మారడంతో ప్రపంచం ప్రకృతికి దూరమవుతోందని రాష్ట్రపతి ముర్ము అన్నారు. వాతావరణ మార్పులపై తక్షణమే దృష్టి సారించి సత్వర చర్యలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు, విధానరూపకర్తలను కోరారు. దేశంలో ఒకవైపు వరదలు, మరోవైపు కరవు నెలకొన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ సందర్భంగా గిరిజనుల జీవన విధానాలను గుర్తుచేస్తూ వారు ప్రకృతి పట్ల సాహానుభూతితో ఉంటున్నారన్నారు.

# విజన్ 2047 విడుదల నేడే

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాటుచేయనున్న సమావేశంలో ఈ డాక్యుమెంటును ఆవిష్కరించనున్నారు. దీనికి 'ఇండియా, ఇండియన్స్, తెలుగూస్ - విజన్ 2047' అని నామకరణం చేశారు. భారతదేశం గ్లోబల్ లీడర్‌గా ఎదిగేందుకు అనుసరించాల్సిన ఐదు వ్యూహాలతో ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ ఫోరం సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్ఎసటీ) సంస్థ రూపొందించింది. సాయంత్రం 5.30 నుంచి 7.30 వరకూ సుమారు రెండు గంటలపాటు సాగే ఈ కార్యక్రమంలో చంద్రబాబు విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించి అనంతరం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తారు. తరువాత మేధావులు, విద్యావంతులు, విద్యార్థులతో చంద్రబాబు ముఖాముఖి సంభాషణ నిర్వహిస్తారు. విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ పూర్తిగా పార్టీరహితంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకా వాలంటూ విద్యావంతులు, మేధావులు, విద్యార్థులకు చంద్రబాబు పేరిట ఆహ్వానపత్రాలు పంపించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆయన హైదరాబాద్ నుంచి మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విశాఖ రానున్నారు. సభ ముగిసిన తరువాత రాత్రికి పార్టీ కార్యాలయంలో బస చేస్తారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా పర్యటనకు బయలుదేరి వెళతారు. చంద్రబాబు ఈ నెల 16 నుంచి మూడు రోజులపాటు కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో సమాజంలోని వివిధ వర్గాలకి పార్టీ ఇచ్చిన హామీలపై ఆయా వర్గాలతో చర్చించి సూచనలు, సలహాలు తీసుకొనే నిమిత్తం ఆయన ఈ పర్యటన పెట్టుకొన్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. 15న విశాఖ నగరంలో బస చేస్తున్న చంద్రబాబు 16వ తేదీ ఉదయం బయలుదేరి మండపేట చేరుకుంటారు. రూరల్ మండలంలో రైతులతో ఆయన రచ్చ బండ కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత మండపేట పట్టణంలో రోడ్ షో, బహిరంగ సభ జరుగుతాయి. 17న కొత్తపేట, 18న అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇవే కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. చంద్రబాబు సోమవారం హరియాణ గవర్నర్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన సతీమణి భువనేశ్వరితో కలి స హరియాణ రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన గవర్నర్ బం డారు దత్తాత్రేయ, ఆయన సతీమణి వసంతలను కుసుకున్నా రు. ఈ సందర్భంగా గవర్నర్ దంపతులు.. చంద్రబాబు, భువనేశ్వరిలను శాలువాతో సన్మానించి శ్రీ కృష్ణుడి ప్రతిమను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలు, తాజా పరిణామాలపై చంద్రబాబు, దత్తాత్రేయ చర్చించినట్లు తెలిసింది.

## కాంగ్రెస్ వస్తే కుంభకోణాల కుంభమేళానే

(మొదటి పేజీ తరువాయి)

పలుకుతున్నారని కేటీఆర్ విమర్శించారు. వ్యవసాయానికి మూడు గంటల కరెంటు చాలంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అంటున్నాడని, మూడు పంటల కేసీఆర్ కావాలా? మూడు గంటల కాంగ్రెస్ కావాలా? మతం పేరుతో మనమధ్య పంచాయతీ పెట్టే బీజేపీ కావాలా? రైతులు ఆలోచించాలన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అగ్రభాగాన నిలిచిందని, కాంగ్రెస్ మాటలు నమ్మి వాళ్లకు ఓట్లేస్తే రాష్ట్రం మళ్లీ పాత రోజుల్లోకి పోవలసి వస్తుందని హెచ్చరించారు. అప్పుడు ఎక్కడ చూసినా దుర్భిక్షం ఉండేదని, ఇప్పుడు మిషన్ కాకతీయతో చెరువులన్నీ బాగుపడి భూగర్భ జలాలు పెరిగాయని తెలిపారు. 24 గంటల కరెంటుతో రైతులు మంచి పంటలు పండిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే ధరణి, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు.. అన్నీ పోయి దళారుల రాజ్యం వస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలు, కాలిన మోటార్లతో రైతులు పడ్డ కష్టాలను గుర్తు తెచ్చుకుని ఆ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు. గడపగడపకు కాంగ్రెస్ అంటూ తిరుగుతున్న షబ్బీర్‌అలీ లాంటి నాయకులు యాభై ఏండ్లలో ఏం పీకిండ్రని మంత్రి నిలదీశారు. షబ్బీర్ మంత్రిగా ఉండి కామారెడ్డిని జిల్లా చేయలేదని, కామారెడ్డికి మెడికల్ కాలేజీ తీసుకురాలేదని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు తాము అధికారం వెలగబెట్టి ప్రజలకు ఏం జేసింద్రో చెప్పి ఓట్లడగాలని పేర్కొన్నారు. ధరల పెరుగుదల పాపం కేంద్రంలోని బీజేపీదేనన్నారు. కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేసే గొప్పనాయకుడని చెప్పారు. రాష్ట్రంలో వెయ్యి ఒక్క గురుకులాలు తీసుకువచ్చి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రెండొందలు ఉన్న పింఛన్‌ను తాము రూ.2 వేలకు, ఐదొందలు ఉన్న పింఛన్ రూ.నాలుగు వేలకు చేశామని తెలిపారు.

## అదే వైసీపీ నేతల లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

భూములను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఉత్తరాంధ్రలో పెద్దఎత్తున భూదోపిడీ జరుగుతుంటే స్థానిక ఎమ్మెల్యేలు వంత పాడుతున్నారని, దోపిడీలో పాలుపంచుకుంటున్నారని ఆరోపించారు. 'విస్సన్నపేట గ్రామానికి రావాలంటే చిన్న రోడ్డు ఉంది. కానీ కొండలను కొట్టి వైసీపీ నేతలు వేస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్‌కు మాత్రం గతంలో దివంగత నేత ఎన్టీఆర్ ఈ ప్రాంతంలో దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను ఆక్రమించి పెద్ద రోడ్డు వేసుకున్నారు. ఈ ప్రాంతంలో వైసీపీ నేతల భూ దందాను ప్రశ్నించే వారు ఎవరూ లేరు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులకు లేదా? విస్సన్నపేటలో భూదోపిడీ, పర్యావరణానికి విఘాతం కలిగించడంపై కేంద్ర పర్యావరణ బోర్డుకు, జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్‌జీటీ)కు జనసేన తరపున ఫిర్యాదు చేస్తాం. సుమారు 600 ఎకరాల పైచిలుకు చదునుచేశారు.

## ఇక భానుడిపై గురి

(మొదటి పేజీ తరువాయి)

యూఆర్ రావు ఉపగ్రహ తయారీ కేంద్రంలో రూపొందించగా.. దాన్ని భారీ భద్రత నడుమ ఆదివారం ప్రత్యేక వాహనంలో తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)కు తీసుకొచ్చారు. ఉపగ్రహాన్ని షార్‌లోని క్లీన్ రూమ్‌లో ఉంచి తుది పరీక్షలు నిర్వహిస్తున్నారు.

## ఎమ్మెల్యే పైళ్ల సహకారంతో వంటగది-శంకుస్థాపన



**వలిగొండ ఆగస్టు 14 సమ సమాజం:** వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ లో మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా 12 లక్షలతో భువనగిరి ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి సహకారంతో విద్యార్థిని విద్యార్థులు భోజనం చేయడానికి కాను భోజనశాల నిర్మాణం కోసం విద్యా కమిటీ చైర్మన్ కడవేరి యాదగిరి చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ హెడ్మాస్టర్ శ్రీమతి ఉమాదేవి బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కలుకూరి రాములు వార్డు సభ్యులు గుర్రాల రాములు ఎడవెల్లి మల్లేశం కలుకూరిముత్యాలు పరకాల కవిత వెంకటేశం వేముల విజయలక్ష్మి వెంకట్ నర్సు ఉపాధ్యక్షులు పిట్టల కుమార్ స్కూల్ ఉపాధ్యాయులుప్రజలు తదితరులు పాల్గొన్నారు

## డబల్ బెడ్ రూమ్ ఇండ్ల కొరకు ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా.



**హైదరాబాద్ ఆగస్టు 14సమ సమాజం:** సిపిఎం పార్టీ హైదరాబాద్ సౌత్ జిల్లా ఆధ్వర్యంలో ప్రజా సమస్యల కోసం జరిగే రిలే దీక్ష అనుమతి ఇవ్వాలని డిసిపి సాయి చైతన్య ని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ప్రజా సమస్యల భాగంగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం ఆగస్టు19 తేదీన జరిగే బండ్లగూడ ఎమ్మార్వో కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షకు అనుమతి కావాలని హైదరాబాద్ సౌత్ జోనల్ డిసిపి సాయి చైతన్య ని అనుమతి ఇవ్వాలని సిపిఎం పార్టీ బృందం కోటిరెడ్డి, సత్తార్, కృష్ణ ,కిషన్ కలవడం జరిగింది. వారు సానుకూలంగా స్పందిస్తూ ఎవరికి ఇబ్బందులు లేకుండా శాంతియుతంగా జరుపుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకులు కృష్ణ నాయక్ మాట్లాడుతూ. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ప్రభుత్వం చేయిస్తున్న సర్వే ప్రజలకు అర్హులైనమూ అని తెలియని పరిస్థితి ఎక్కువ శాతం చిన్న చిన్న విషయాలు ఒరిజినల్ ఆన్లైన్ చేసిన స్లిప్ లేదు అనే విధంగా అధికారులు తిరస్కరిస్తున్నారు. పేద ప్రజలు ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు వస్తున్నాయని కల ఇలా అధికారుల నిర్లక్ష్యానికి పేద ప్రజలు ఆశయాలు నిరాశ అవుతోంది. నిజానికి అర్హులైన వారికి తిరస్కరించకుండ ఇండ్లు వచ్చే విధంగా అధికారులు ఆలోచనలు ఉండాలని. ఈ నెల ఆగస్టు19 రోజున ఉదయం11గంటలకు బండ్లగూడ ఎమ్మార్వో కార్యాలయం ముందు జరిగే రిలే దీక్ష ప్రజలు జయప్రదం చేయాలని ఈ సందర్భంగా తెలియపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఎం పార్టీ జిల్లా నాయకులు కోటిరెడ్డి. అబ్దుల్ సత్తార్ .కృష్ణ ..కిషన్. శ్రీను .తదితరులు పాల్గొన్నారు.

## అనిల్ కుమార్ రెడ్డి ని కలిసిన నవీన్ గౌడ్



**ఆగస్టు 14 సమ సమాజం:**బీఆర్ఎస్ పార్టీలో చేరిన యాదాద్రి భువనగిరి జిల్లా కు చెందిన రాష్ట్ర నాయకులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ని సోమవారం బీఆర్ఎస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్ గౌడ్ కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా అనిల్ కుమార్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసి రాబోయే రోజుల్లో ఆయన ఉన్నత పదవుల్లో కొనసాగాలని కోరారు

## ఘనంగా అడ్డగుడూర్ మండల ఎస్ ఐ నాగరాజు జన్మదిన వేడుకలు

**అడ్డగూడూర్ :సమ సమాజం:** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగుడూర్ మండల పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు గారి జన్మదిన వేడుకలు అడ్డగుడూర్ మండల యువ నాయకులు బాలెంల నరేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మర్యాద పూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసి శాలువా తో ఘనంగా సన్మానించడం జరిగింది.ఈ కార్యక్రమంలో నిఘా న్యూస్ రిపోర్టర్ మంటిపల్లి సతీష్ , ప్రజాజ్యోతి న్యూస్ రిపోర్టర్ సుధాకర్, అడ్డగుడూర్ నాయకులు శ్రీరాముల ప్రదీప్ బాలెంల మహేందర్లి బాలెంల పాండు, బాలెంల బాబూరావు, బాలెంల నరేష్, బుర్రు సునీల్, చెడే సైదులు, చిప్పపెల్లి నరేష్, శంకర్, జిల్ల రాకేష్, యువ నాయకులు సాయి రెడ్డి మహేష్ అనిల్ సూర్య,పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆగిన చల్లమల్ల ప్రజా చైతన్య యాత్ర

## మునుగోడు కాంగ్రెస్ వర్గపోరు కారణంగా వాయిదా నిజమా ?

- ఆరు రోజులకే నిలిచిన ప్రజాచైతన్య యాత్ర
- చౌటుప్పల్, మునుగోడు,నారాయణపురం మండలాల్లో చల్లమల్ల ఆధ్వర్యంలో పనిచేయని అసలు క్యాడర్
- చండూర్, నాంపల్లి, మర్రిగూడలో అంతంతే !
- మ్యానిఫెస్టోను వివరించుటలో తడపాటు
- చల్లమల్లకు టికెట్ రావడం కష్టమే !
- కార్యకర్తలలో బలపడుతున్న అనుమానం
- చల్లమల్లతో నడిచేందుకు క్యాడర్ వెనకడుగు
- చౌటుప్పల్, మునుగోడు ప్రాంతంలో తీవ్ర వ్యతిరేకత !



**నల్లగొండ, ఆగస్టు 14 (సమ సమాజం):** మునుగోడు నియోజకవర్గంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఆపసో పాలుపడుతూ ప్రజాచైతన్యయాత్ర కార్యక్రమాన్ని ఆరు రోజులు పూర్తి చేసుకున్నారు. మధ్యంతరంగా యాత్రను నిలిపివేస్తున్నట్లు సూత్రప్రాయంగా తెలుస్తుంది. అయితే ఆరు రోజుల్లో చేపట్టిన కార్యక్రమాలకు ప్రజల నుంచి అంతగా స్పందన లేకపోగా చల్లమల్ల కృష్ణారెడ్డి మాటల్లో తడపాటు ఉండటంతో తన ప్రసంగం అంతగా ఆకట్టుకోకలేకపోతుందని, దానితో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలోని ప్రజలకు చేరవేయడంలో విఫలం అవుతున్నారని తెలుస్తుంది. ఇప్పటికే మర్రిగూడ, నాంపల్లి, చండూర్‌లో అరకొరగా పర్యటించిన చల్లమల్లకు అంత ఆశించిన తీరుగా స్పందన లేకపోవడానికి గల కారణం ఇరు వర్గాలుగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీని సమన్వయం చేసుకోవడంలో విఫలం కావడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. పాదయాత్ర మధ్యంతరంగా నిలిపివేయడానికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయని, మునుగోడు, చౌటుప్పల్ ప్రాంతాల్లో వర్గపోరు తారాస్థాయిలో ఉండటం కారణంగా కొంత సమయం తీసుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు వినికిడి. మరో కారణం చల్లమల్లకు ఆరోగ్య సమస్య తలెత్తిందని దానివల్లనే పాదయాత్ర నిలిపివేశారని మరో వాదన వినబడుతుంది. కాని ఈ రెండింటికి సంబంధించి అధికారికంగా ప్రకటన విడుదల చేయలేదని తెలుస్తుంది. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు ఇలానే ఉంటే చల్లమల్లకు టికెట్ కష్టమే అని, ఇదే విషయం కార్యకర్తలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తుంది. అదే స్థాయిలో మునుగోడు నియోజకవర్గం కాంగ్రెస్ క్యాడర్ కూడా పూర్తి స్థాయిలో సహకరించడంలేదని చెప్పుకుంటున్నారు.

## సునీతమ్మ సేవ స్వచ్ఛంద సంస్థ ద్వారా సీలింగ్ ఫ్యాన్ల పంపిణీ

**మెదక్ సమ సమాజం:** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో గల హత్నూర మండలం లో వాకిటి లక్ష్మారెడ్డి 24వ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రమైన హత్నూర కస్తూర్బా బాలికల పాఠశాల, కళాశాలకు 30 సీలింగ్ ఫ్యాన్ లను బహుకరించినట్టు సునితమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు శివశంకర్ రావు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి సునితమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ ను సంప్రదించి ఫ్యాన్ లేకపోవడం వల్ల విద్యార్థినిలు దోమల బారిన పడి నిద్ర లేక ఆరోగ్యం చెడిపోతుందని తెలపడంతో దానికి సునీతమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు బివి శివ శంకర్రావు సానుకూలంగా స్పందించి

# నిరుపేదల ఆభివృద్ధే సీఎం కేసీఆర్ ధ్యేయం

300 మంది లబ్ధిదారులు రూ.3 కోట్ల బీసీ ఎంబీసీ బంధు (కులవృత్తులు) చెక్కులు పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి. బీసీ కులాలు, నిరుపేదల అభివృద్ధి కోసమే సీఎం కేసీఆర్ బీసీ బంధు ప్రవేశపెట్టారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని నందన గార్డెన్ లో 300 మంది బీసీ ఎంబీసీ కులవృత్తి లబ్ధిదారులకు బీసీ బంధు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన బీసీలందరికీ రూ.లక్ష సాయం అందు తుందన్నారు. మొదటి విడుతగా నియోజకవర్గానికి 300 మందికి అందిస్తున్నామని, విడతల వారీగా అందరికీ చెక్కులు అందిస్తామన్నారు. ప్రభుత్వం అందించే పథకాలన్నీ ప్రజలకు చేరడంతోనే ప్రజలందరూ బీఆర్ఎస్ పార్టీ వైపు ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకం కులవృత్తులకు ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. నిరంతరంగా బీసీలకు సాయం అందుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ ఛైర్మెన్ లు, మండల పార్టీ అధ్యక్షులు,వైస్ ఎంపీపీలు, పిఎసిఎస్ ఏఎంసీ ఛైర్మెన్ లు,వైస్ ఛైర్మెన్ లు, డైరెక్టర్‌లు, పట్టణాధ్యక్షులు, రైతు సమితి మండల కో ఆర్డినేటర్,జిల్లా డైరెక్టర్



లు,మండల అనుబంధ సంఘాల అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ లు,కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ లు, మాజీ ప్రజా ప్రతినిధులు,గ్రామ శాఖ అధ్యక్షులు, రైతు సమితి గ్రామ కో ఆర్డినేటర్‌లు, గ్రామ అనుబంధ సంఘాల అధ్యక్షులు, యువకులు, యువత అధ్యక్షులు, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ హాస్టల్స్ లో వసతులు నాణ్యమైన ఆహారం అందించాలి

**బొట్టు శివకుమార్ కెవిపిఎస్ నల్గొండ జిల్లా సహాయ కార్యదర్శి డిమాండ్**

**మునుగోడు సమ సమాజం:** నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రంలో ఎస్సి బాలుర సంక్షేమ హాస్టల్స్ సమస్యల నిలయాలుగా మారాయని వసతులు కల్పించడంలో నాణ్యమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి బొట్టు శివకుమార్ అన్నారు. ఈరోజు మునుగోడు మండల కేంద్రంలోని ఎస్సి బాలుర హాస్టల్స్ సందర్శించి సమస్యలపై సర్వే నిర్వహించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడడం జరిగింది. ఈ సందర్భంగా బొట్టు శివకుమార్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో సంక్షేమ హాస్టల్స్ లోపబుఇష్టంగా ఉన్నాయని, ఆహార నాణ్యత లోపంగా ఉందని వసతులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. ఫ్యాన్లు తిరగడం లేదని డెంగి మలేరియా ఇతర విష జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. సంక్షేమ హాస్టల్స్ వార్డెన్లు సక్రమంగా రోజు హాజరైనప్పటికీ వసతులు కల్పించి నాణ్యమైన భోజనం అందించడంలో తీవ్ర నిర్లక్ష్యం విడనాడాలని అన్నారు. బిల్డింగు స్థితుల వ్యవస్థలో సరియగు వసతులు లేవని వేల రూపాయలు కిరాయిలు ప్రభుత్వం చెల్లిస్తున్నప్పటికి వసతులు లేవన్నారు. తక్షణమే వాటిపై సమగ్రంగా జిల్లా అధికారులు పరిశీలించి వసతులు కల్పించాలని డిమాండ్



చేశారు. జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్ లో సర్వేలు నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాను, రాము, సైదులు, శంకరయ్య యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన అక్షర యోధులను గుర్తించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించాలి

» వర్కింగ్ జర్నలిస్టులకు సొంత ఇంటి కల నిజమయ్యేనా » అనర్హులతో పెడదారి పడుతున్న జర్నలిస్టుల ఇండ్ల పంపిణీ

**తొర్రూర్ సమ సమాజం:** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ కేంద్రంలో ఉంటు జర్నలిజంలో కొన్ని ఏండ్ల తరబడి వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న వారికి వెంటనే డబుల్ బెడ్ రూములు మంజూరు చేయాలని తొర్రూర్ వర్కింగ్ జర్నలిస్టులు పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్టుల పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తొర్రూరు ఆర్డీవో నరసింహారావు కి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వర్కింగ్ జర్నలిస్టులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు రెండు పడకల గదులను అందజేస్తున్న నేపథ్యంలో తొర్రూరు మున్సిపాలిటీలోనీ అన్నారం రోడ్ లో నిర్మిస్తున్న రెండు పడకల గదుల ఇండ్లను మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చొరవతో అందజేసే క్రమంలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు బదులగా కొంతమంది అర్హత లేనివారు అనర్హులైన జర్నలిస్టులు కానీ కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవారు 2004 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు హయాంలో 13 మంది జర్నలిస్టులు జర్నలిస్టుల కోటాలో స్థలాలు ఇల్లు పొందిన వారు ఒక పత్రిక నుండి ఒకరి పేరు కంటే ఎక్కువమందికి కేటాయించడం స్థానికేతర్లకు బంధుమిత్రులకు ప్రాధాన్యత కల్పించడం ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు కేటాయించుకోవడం కనీసం 3సంవత్సరాల అనుభవం లేని వారికి కేటాయిస్తూ గోప్యంగా జాబితాను ఏర్పాటు చేయడం చాలా




దురదృష్టకరమని అర్హులైన తోటి వర్కింగ్ జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతినే విధంగా పక్షపాతం వహిస్తూ కొంతమంది జర్నలిజం పేరుతో ఆర్థికపరమైన లాభాలను ఆశిస్తూ అనుచరులకు లబ్ధి చేకూర్చుకోవాలనుకుంటున్నారని అధికారులు కూడా మభ్యపెడుతు పారదర్శకత వహించాల్సిన తహసిల్దార్ ఆర్డీవోలు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల జాబితా పేర్లను చూపించకపోగా ఏలాంటి సమాచారం ఇవ్వకపోవడం వెనుక రహస్య%శీ% ఏంటంటూ వ్యక్తిగతంగా దరఖాస్తులను స్వీకరించకుండా రహస్య ఒప్పందాలతో కొంతమంది ఇచ్చిన పేర్లనే పట్టాలు జారీచేసి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుని తప్పుదోవ పట్టించే విధంగా వ్యవహరిస్తున్న వారు ఇప్పటికైనా దూరదృష్టితో పారదర్శకతతో ఆహార భద్రత కార్డులు ఉన్న నిజమైన అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు మౌఖిక విధానం ద్వారా అసలైన జర్నలిస్టులను గుర్తించి రెండు పడకల గదులను కేటాయించవలసిందిగా కోరుకుంటు త్వరలో మంత్రి ఎర్రబెల్లిని మరియు జిల్లా కలెక్టర్ ను కలుస్తామని ఇట్టి విషయాలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తామని తోటి వర్కింగ్ జర్నలిస్టులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరువూరు మండల వర్కింగ్ జర్నలిస్టులు మహమ్మద్ అమీర్, వెల్తూరి పూర్ణ రామచందర్, పెందోట కిషన్ రావు,గూడెల్లి యాకయ్య, పాండుల బిక్షపతి మరియు కొమ్ము దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



# భారీ సెట్టింగ్‌లు.. టెక్నికల్ వాల్యూస్‌తో దేవర

ఆర్‌ఆర్‌ఆర్’ లాంటి బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్ తర్వాత జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న మరో భారీ చిత్రం ’దేవర’. ’ఆర్‌ఆర్‌ఆర్’ తర్వాత గ్లోబల్ వైడ్ క్రేజ్ రావడంతో.. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై ఫ్యాన్స్‌తో పాటు సినీ ప్రియుల్లో భారీ అంచనాలే నెలకొన్నాయి. ముఖ్యంగా ’కొమురం భీముడో’ సాంగ్‌లో ఎన్టీఆర్ యాక్టింగ్ చూసి వరల్డ్ వైడ్ ఫ్యాన్స్.. దేవర కోసం మరింత ఎక్కువ ఆశిస్తున్నారు. దీంతో తారక్ పై ఒత్తిడి బాగా పెరిగిపోయింది. అందుకే ఆయన కూడా ఈ చిత్రం కోసం బాగా కష్టపడుతున్నారు. ప్రత్యేక శ్రద్ధ పెట్టి మరీ శ్రమిస్తున్నారు. రీసెంట్‌గా ’దేవర’ కొత్త షెడ్యూల్ ప్రారంభమైందంటూ మూవీటీమ్ అఫీషియల్ ఓ సముద్రపు పోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. దీని బట్టి భారీ తుఫాను, సముద్రపు అలల మధ్యలో హై ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నట్లు తెలిసింది. ఈ సీక్వెన్స్‌లో ఎన్నో స్టంట్ లు, విజవల్ ఎఫెక్ట్ తో షూట్ చేస్తున్నారట. తాజాగా అందిన సమాచారం ప్రకారం.. ప్రస్తుతం ఎన్టీఆర్ ఈ సీ సీక్వెన్ షూట్ కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారో తెలిసింది. హైదరాబాద్ లోని ఒక స్పెషల్ సెట్ లో కొన్ని యాక్షన్ సీక్వెన్స్ ను షూట్ చేస్తున్నారు. ఓ హాలీవుడ్ టీమ్ ఆధ్వర్యంలో రూపొందించే ఈ సీక్వెన్స్ లోని ప్రతి సన్నివేశాన్ని ఎంతో శ్రద్ధగా తెలుసుకుని మరి తారక్ చేస్తున్నారట. విజవల్ ఎఫెక్ట్ మేకింగ్ విషయంలోనూ చాలా జాగ్రత్తగా చూసుకుంటున్నారట. ఏ ఒక్కటి కూడా వదలకుండా ప్రతి చిన్న విషయాన్ని తాను కూడా అర్థం చేసుకుంటూ వీలైతే సలహాలు కూడా ఇస్తూ అన్నింట్లో ఇన్వాల్వ్ అవుతున్నారని తెలిసింది. రీసెంట్ విజవల్ ఎఫెక్ట్ విషయంలో ’ఆదిపురుష్’ ఎన్ని విమర్శలు అందుకుందో తెలిసిన విషయమే. అందుకే తారక్ ముందు జాగ్రత్తగా తానే అన్ని దగ్గరుండి మరీ చూసుకుంటున్నారని అంతా అంటున్నారు. ఇకపోతే కొరటాల శివ, ఎన్టీఆర్ కాంబోలో గతంలో వచ్చిన జనతా గ్యారేజ్.. ప్రకృతి గురించి ఆడియెన్స్ సోషల్ మెసేజ్ ఇస్తూనే మాస్ ఎంటర్‌టైనర్‌గా బాగా ఆకట్టుకుంది. ఈ హిట్ కాంబో మళ్లీ రిపీట్ కాబోతుందని తెలియగానే.. ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అయ్యారు. ఇక ఈ చిత్ర క్యాస్టింగ్ కూడా ప్రేక్షకుల్లో మరింత అంచనాలను పెంచింది. ఈ సినిమాతో శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ టాలీవుడ్ అరంగేట్రం చేయనుంది. తమిళ సెన్సేషన్ అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నారు. బాలీవుడ్ ప్రముఖ యాక్టర్ సైఫ్ అలీ ఖాన్ విలన్‌గా నటిస్తున్నారు. సినిమాను 2024 ఏప్రిల్ 5న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ చేయనున్నారు.




# ఎలాంటి గ్లామర్ పాత్రలైనా సిద్ధమే

తమిళనటి దుషారా ప్రకటన

పా రంజిత్ దర్శకత్వంలో ఆర్య హీరోగా రూపొందిన ’సార్పట్టా పరంపరై’ సినిమాలో హీరోయిన్‌గా నటించిన ముద్దుగుమ్మ దుషారా. సాధారణంగా తమిళనాట రాజకీయ ఫ్యామిలీ నుంచి సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన హీరోలు ఉన్నారు కానీ... హీరోయిన్ లు మాత్రం లేరు. ఆ లోటును దుషారా తీర్చింది. రాజకీయ కుటుంబానికి చెందిన దుషారా సినిమా ఇండస్ట్రీలో సక్సెస్ ను దక్కించుకోగలదా... అసలు ఆఫర్లు దక్కించుకునేనా అంటూ కొందరు అనుమానాలు వ్యక్తం చేశారు. కానీ మొదటి సినిమా సార్పట్టా సినిమాతో విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. ప్రస్తుతం వరుసగా సినిమాల్లో నటిస్తోంది. తాజాగా తమిళ స్టార్ హీరో ధనుష్ కి జోడీగా నటించే అవకాశం దక్కించుకుంది. ఫ్యామిలీ పాత్రల్లోనే కాకుండా గ్లామర్ రోల్స్ ను చేయడానికి... కమర్షియల్ పాత్రల్లో కనిపించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లుగా హీరోయిన్ దుషారా తాజాగా ఒక ఇంటర్వ్యూలోతెలిపి అందరి దృష్టిని ఆకర్షించింది. వల్గర్ గా నటించడం వేరు.. అందంగా కనిపించడం వేరు అన్నట్లుగా ముద్దుగుమ్మ దుషారా చెప్పుకొచ్చింది. హీరోయిన్ గా తాను ఎలాంటి పాత్రల్లో అయినా నటించేందుకు సిద్ధం అన్నట్లుగా చెప్పుకొచ్చింది.

# చంద్రముఖిగా వస్తున్న కంగనా

సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన ’చంద్రముఖి’ సినిమా ఎంత పెద్ద హిట్టయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అప్పట్లోనే ఈ సినిమా సునాయసంగా పాతిక కోట్లు కలెక్ట్ చేసి రికార్డ్ సృష్టించింది. ఈ సినిమాకు దర్శకత్వం వహించిన పి. వాస్ తన మేకింగ్, విజన్‌తో హార్రర్ సినిమాలకు ఓ కొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేశాడు. సుమారు పద్దెనిమిదేళ్ల తర్వాత ఈ సినిమాకు సీక్వెల్ తెరకెక్కుతుంది. లారెన్స్‌ను హీరోగా పెట్టి పి.వాసు ఈ సినిమా సీక్వెల్‌ను రూపొందించాడు. కంగనా రనౌత్ కథానాయికగా నటిస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తిచేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుంటుంది. ఈ సినిమాకు సంబంధించి లారెన్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ ఇటీవలే విడుదల చేయగా.. ఆ లుక్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. తాజాగా ఈ చిత్రం నుంచి కంగనా రనౌత్ ఫస్ట్ లుక్ ను మేకర్స్ విడుదల చేశారు. అందమే అసూయ పడేలా చంద్రముఖి గెటప్‌లో కంగనా లుక్ అదిరిపోయింది. అద్దం ముందు నిలుచుని తనని తాను చూసుకుంటున్న ఈ లుక్ అభిమానులను కట్టి పడేస్తుంది. ఈ లుక్‌పై మేకర్స్ స్పందిస్తూ.. ‘అందం అభినయంతో కట్టిపడేసే చంద్రముఖిగా మన ముందుకు వస్తుంది కంగనా రనౌత్‘ అంటూ మేకర్స్ సోషల్ మీడియాలో రాసుకోచ్చారు.








## సౌత్‌జోన్ చాంప్స్ శ్రేయాన్సి, ప్రణవ్

మలక్‌పేట: కోయంబత్తూరు వేదికగా జరిగిన సౌత్‌జోన్ బ్యాడ్మింటన్ టోర్నీలో శ్రేయాన్సి, ప్రణవ్‌రావు విజేతలుగా నిలిచారు. తెలంగాణ సహా ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి దాదాపు 200 మందికి పైగా ప్లేయర్లు ఈ టోర్నీలో పాల్గొన్నారు. రాష్ట్రం నుంచి 25 మంది ప్లేయర్లు బరిలోకి దిగారు. మహిళల సింగిల్స్ విభాగంలో శ్రేయాన్సి, బాలుర సింగిల్స్‌లో ప్రణవ్‌రావు టైటిళ్లు దక్కించుకున్నారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్‌రెడ్డి, వైష్ణవి రన్నరప్‌గా నిలువగా, పురుషుల సింగిల్స్‌లో సాహాస్‌కుమార్, బాలికల సింగిల్స్‌లో ప్రశాన్సా రన్నరప్ దక్కించుకున్నారు. బాలుర సింగిల్స్‌లో హర్షిత్, బాలికల్లో రిషితాపాండే, డబుల్స్‌లో శిఖ, నయనికారెడ్డి విజేతలుగా నిలిచారని టీమ్ మేనేజర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## ఫిన్ వీడ్కోలు



లండన్: ఇంగ్లండ్ సీనియర్ పేసర్ స్టీవ్ ఫిన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఆటలో ని అన్నీ ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు సోమవారం వెల్లడించాడు. ఏడాది కాలంగా మోకా లి గాయంతో ఇబ్బంది పడుతున్న 34 ఏండ్ల ఫిన్.. 18 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఇంగ్లండ్ తరఫున 36 టెస్టులు, 69 వన్డేలు, 21 టీ20లు ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 254 వికెట్లు పడగొట్టాడు.

## విండీస్ పర్యటన ముగిసింది..

# చలో ఐర్లాండ్



2 టెస్ట్‌లు, 3 వన్డేలు, 5 టీ20ల టీమిండియా విండీస్ పర్యటన నిన్నటితో (ఆగస్ట్ 13) ముగిసింది. ఈ మల్టీ ఫార్మాట్ సిరీస్‌లో భారత్ టెస్ట్ (1–0), వన్డే సిరీస్‌లు (2–1) నెగ్గగా.. విండీస్ టీ20 సిరీస్ (3–2) కైవసం చేసుకుంది. ఫ్లోరిడా వేదికగా విండీస్‌తో జరిగిన ఆఖరి టీ20 అనంతరం ఆరు మందితో (యశస్వి జైస్వాల్, తిలక్ వర్మ, సంజు శాంసన్, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింగ్, ముకేశ్ కుమార్) కూడిన భారత జట్టు ఇక్కడి నుంచి నేరుగా ఐర్లాండ్‌కు పయనం కాగా.. మిగతా తొమ్మిది మంది భారత్ నుంచి బయల్దేరతారు. ఐర్లాండ్ పర్యటనలో భారత్ ఆగస్ట్ 18, 20, 23 తేదీల్లో మూడు టీ20లు ఆడుతుంది. ఈ జట్టుకు బుమ్రా కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. అతనికి డిప్యూటీగా రుతురాజ్ గైక్వాడ్ వ్యవహరించనుండగా.. ఐపీఎల్–2023 స్టార్లు రింకూ సింగ్, జితేశ్ శర్మలకు తొలిసారి భారత జట్టులో చోటు దక్కింది. ఐర్లాండ్ పర్యటనలో మూడు మ్యాచ్‌లు భారతకాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఈ మూడు మ్యాచ్‌లు డబ్లిన్‌లోని ద విలేజ్ స్టేడియంలో జరుగనున్నాయి. ఈ మ్యాచ్‌లన్నీ జియో సినిమా యాప్‌తో పాటు స్పోర్ట్స్18లో ప్రత్యక్ష ప్రసారమవుతాయి.

**భారత్‌తో టీ20 సిరీస్‌కు ఐర్లాండ్ జట్టు:** పాల్ స్టిర్లింగ్ (కెప్టెన్), ఆండ్రూ బల్బిర్నీ, మార్క్ అడైర్, రాస్ అడైర్, కర్టిస్ క్యాంఫర్, గారెత్ డెలానీ, జార్జ్ డాక్రెల్, ఫియోన్ హ్యాండ్, జోష్ లిటిల్, బ్యారీ మెక్‌కార్తీ, హ్యారీ టెక్టర్, లోర్కాన్ టక్కర్, థియో వాన్ వోర్కోమ్, బెన్ వైట్, క్రెయిగ్ యంగ్

**ఐర్లాండ్ టీ20లకు భారత జట్టు:** జస్ప్రీత్ బుమ్రా (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, సంజు శాంసన్ (వికెట్‌కీపర్), జితేష్ శర్మ (వికెట్‌కీపర్), శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్, షాబాజ్ అహ్మద్, రవి బిష్ణోయ్ , ప్రసిద్ కృష్ణ, అర్షదీప్ సింగ్, ముఖేష్ కుమార్, అవేష్ ఖాన్

# ఆసీస్‌తో పరిమిత ఓవర్ల సిరీస్..

## సౌతాఫ్రికా జట్టు ప్రకటన.. జట్టు నిండా విధ్వంసకర ఆటగాళ్లే..!




ఆస్ట్రేలియాతో స్వదేశంలో జరిగే టీ20, వన్డే సిరీస్‌ల కోసం? క్రికెట్ సౌతాఫ్రికా (సీఎస్‌ఏ) వేర్వేరు జట్లను ఇవాళ (ఆగస్ట్ 14) ప్రకటించింది. ఈ పర్యటనలోని టీ20 సిరీస్ కోసం సౌతాఫ్రికన్ సెలెక్టర్లు విధ్వంసకర ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్‌కు తొలిసారి పిలుపునిచ్చారు. ఇతనితో పాటు వికెట్‌కీపర్ కమ్ బ్యాటర్ డోనోవన్ ఫెర్రీరా, యువ బ్యాటర్ మాథ్యూ బ్రీట్జ్కీలను కూడా తొలిసారి ఎంపిక చేశారు. ఆసీస్ పర్యటనలోని 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం సౌతాఫ్రికా సెలెక్టర్లు 15 మంది సభ్యులతో కూడిన యువ జట్టును ప్రకటించారు. సీనియర్లు క్వింటన్ డికాక్, హెన్రిచ్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్, కగిసో రబాడ, అన్రిచ్ నోర్జేల గైర్హాజరీలో సెలెక్టర్లు యువకులకు అవకాశం ఇచ్చారు. పైపేర్కొన్న సీనియర్లంతా ఇదే పర్యటనలో జరిగే 5 మ్యాచ్‌ల వన్డే సిరీస్‌కు అందుబాటులోకి వస్తారు. టీ20 సిరీస్‌కు ఎయిడెన్ మార్క్రమ్, వన్డే సిరీస్‌కు టెంబా బవుమా కెప్టెన్లుగా వ్యవహరిస్తారు. గాయం కారణంగా గతకొంతకాలంగా జట్టుకు దూరంగా ఉన్న సీనియర్ ఆటగాడు కేశవ్ మహారాజ్ సైతం రెండు జట్లలో చోటు దక్కించుకున్నాడు. ఆసీస్ పర్యటనలో టీ20 సిరీస్‌కు సౌతాఫ్రికా జట్టు: ఎయిడెన్ మార్క్రమ్ (కెప్టెన్), టెంబా బవుమా, మాథ్యూ బ్రీట్జ్కీ, డెవాల్డ్ బ్రెవిస్, గెరాల్డ్ కోయెట్జీ, డోనోవన్ ఫెర్రీరా, జోర్న్ ఫార్టుయిన్, రీజా హెండ్రిక్స్, మార్కో జన్సెన్, సిసంద మగాల, కేశవ్ మహరాజ్, లుంగీ ఎంగిడి, తబ్రేజ్ షంషి, ట్రిస్టన్ స్టబ్స్, లిజాడ్ విలియమ్స్, రస్సీ వాన్ డెర్ డస్సెన్

**ఆసీస్ పర్యటనలో వన్డే సిరీస్‌కు సౌతాఫ్రికా జట్టు:** టెంబా బవుమా (కెప్టెన్), డెవాల్డ్ బ్రెవిస్, గెరాల్డ్ కోయెట్జీ, క్వింటన్ డికాక్, జోర్న్ ఫార్టుయిన్, రీజా హెండ్రిక్స్, మార్కో జన్సెన్, హెన్రిచ్ క్లాసెన్, సిసంద మగాలా, కేశవ్ మహరాజ్, ఎయిడెన్ మార్క్రమ్, డేవిడ్ మిల్లర్, లుంగి ఎంగిడి, అన్రిచ్ నోర్జే, తబ్రేజ్ షంషి, వేన్ పార్నెల్, కగిసో రబాడ, ట్రిస్టన్ స్టబ్స్, రస్సీ వాన్ డెర్ డస్సెన్

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in